పంజాబ్ నుంచి క్షేమంగా తిరిగొచ్చిన

కబడ్డీ జట్టు



మీడియాతో మాట్లాడుతున్న కబడ్డీ క్రీడాకారిణులు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు వెళ్లి, అక్కడ జరిగిన గొడవతో దాడికి గురైన రాష్ట్ర మహిళా కబడ్డీ జట్టు మంగళవారం నగరానికి తిరిగొచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తీసుకున్న తక్షణ చర్యల వల్లే తాము ప్రాణాలతో బయటపడి క్షేమంగా తిరిగొచ్చామని మహిళా కబడ్డీ జట్టు సభ్యులు పేర్కొన్నారు. పంజాబ్‌లోని బట్టిండా జిల్లాలో అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో రాష్ట్రం తరఫున మదర్‌థెరిసా, పెరియార్, అళగప్పా విశ్వవిద్యాలయాలకు చెందిన 36 మంది మహిళా క్రీడాకారులు, ముగ్గురు కోచ్‌లు వెళ్లారు. బీహార్, తమిళనాడు జట్ల మధ్య జరిగిన పోటీ సందర్భంగా విన్నింగ్ పాయింట్లకు సంబంధించి గొడవలు తలెత్తాయి. ఆ సందర్భంగా రాష్ట్రానికి చెందిన క్రీడాకారులపై ప్రత్యర్థి జట్టు సభ్యులు దాడికి దిగిన విషయం తెలిసిందే. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కోచ్ పాండ్యరాజన్‌ను పోలీసులు నిర్బంధించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన మరుక్షణమే రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు, క్రీడామంత్రిత్వ శాఖ నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కబడ్డీ పోటీలు జరిగిన బుట్టిండా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి మాట్లాడారు. తమ వారిని క్షేమంగా పంపాలని వారికి సూచించారు. ఈ నేపథ్యంలో వారంతా మంగళవారం ఉదయం చెన్నై చేరుకున్నారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారిణి జయశ్రీ మీడియాతో మాట్లాడుతూ.. తమపై దాడి చేసేందుకు వచ్చిన వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించానని, ఈ విషయం తెలియక తనపై దాడికి దిగారని, రెఫరీలు కూడా దాడి చేశారని పేర్కొంది. పోటీ నిర్వాహకులు తమ నుండి క్షమాపణ పత్రాలు కోరారని, ఆ లోగా ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పంజాబ్ ప్రభుత్వంతో ఫోన్‌లో మాట్లాడటంతో పరిస్థితి సద్దుమణిగిందని తెలిపారు. అప్పటి దాకా తమను దోషులుగా చూసిన క్రీడాప్రాంగణం సిబ్బంది, పోలీసులు తమకు రక్షణగా నిలిచి ఢిల్లీలోని తమిళనాడు హౌస్‌కు క్షేమంగా చేర్చారని వివరించింది.



విల్లుపురం సభలో మహిళకు సహాయాలు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి

అన్ని రంగాల్లో ముందున్నాం

- ద్రావిడ తరహా పాలనతోనే సాధ్యం
- విల్లుపురం సభలో సీఎం స్టాలిన్





సామాజిక న్యాయ పోరాటయోధుల స్మారక మండపాన్ని ప్రారంభిస్తున్న స్టాలిన్

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా పరిపాలన వల్లే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రత్యర్థులు పసలేని విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మతతత్వ శక్తులు తమ ప్రాబల్యాన్ని విస్తరించాలని ప్రయత్నిస్తున్నాయని, ఆ దుష్ట శక్తులను దునుమాడి సామాజిక న్యాయాన్ని విస్తరించడమే తన లక్ష్యమని స్టాలిన్ స్పష్టం చేశారు. విల్లుపురంలో మంగళవారం ఉదయం జరిగిన సభలో ఆ జిల్లాలో రూ.882 కోట్లతో చేపట్టిన 231 పథకాల ప్రారంభోత్సవం, 116 కొత్త పథకాలకు శంకుస్థాపన చేసి, 35 వేల మంది లబ్ధిదారులకు రూ.323.71 కోట్ల విలువైన సహాయాలు పంపిణీ చేశారు. రూ.4కోట్లతో నిర్మించిన మాజీ మంత్రి, దివంగతనేత ఎ.గోవిందసామి స్మారక మండపాన్ని ప్రారంభించి, ఆ మండప ప్రాంగణంలోని నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని స్టాలిన్ ఆవిష్కరించారు. ఇదే విధంగా రాష్ట్ర తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖల ఆధ్వర్యంలో వయతరెడ్డి గ్రామంలో రూ.5.70 కోట్లతో నిర్మించిన 21 మంది సామాజిక న్యాయపోరాట యోధుల స్మారక మండపాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... విల్లుపురంలో 21 మంది సామాజిక న్యాయపోరాట యోధులకు స్మారక మండపం, రాష్ట్రంలో తొలిసారిగా ఉదయించే సూర్యుడి గుర్తుపై పోటీ చేసి గెలిచిన ద్రావిడ ఉద్యమ నేత గోవిందసామికి స్మారక మండపం ప్రారంభించి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బీసీ రిజర్వేషన్ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన 21 మంది సామాజిక న్యాయపోరాట యోధులకు స్మారక మండపం నిర్మించిన ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుందని, 1989లో కరుణానిధి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కొద్ది రోజులకే ఓబీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ప్రకటించారని స్టాలిన్ గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, ఓబీసీలు తదితర బలహీన వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉండేది డీఎంకే ప్రభుత్వమేనని, అన్నాడీఎంకే హయాంలో ఈ వర్గాలకు ఎలాంటి న్యాయం జరుగలేదని, రిజర్వేషన్ల కోసం పోరాడినవారిపై కాల్పులు జరిపి 21 మందిని హతమార్చిన ఘనత ఆ పార్టీ ప్రభుత్వానికి దక్కిందని విమర్శించారు. విల్లుపురం జిల్లా అభివృద్ధి కోసం కొత్త పథకాలు అమలు చేయనున్నామని ఆమేరకు సెంజిలో కొత్త బస్ స్టేషన్, దిండివనం సిడ్కోలో మెడికల్ పార్కు, దిండివనం - మరక్కాణం రహదారి ఫోర్‌వేగా మార్పు, దిండివనంలో కొత్త ఆస్పత్రి, విక్రవాండిలో రెండు న్యాయస్థానాలకు ఉమ్మడి భవనసముదాయం వంటి అభివృద్ధి పథకాలు చేపట్టనున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, సామినాథన్, రాజేంద్రన్, శివశంకర్, గణేశన్, ఎంపీలు జగద్రక్షగన్, రవి కుమార్, ధరణివేందన్, శాసనసభ్యులు మస్తాన్, లక్ష్మణన్, అన్నియూరు శివా, మణికన్నన్, శివకుమార్, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, జిల్లా కలెక్టర్ పళని, మాజీ మంత్రి గోవిందసామి కుటుంబీకులు, 21 మంది సామాజిక న్యాయపోరాట యోధుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల బలవన్మరణం



బాల్‌రాజ్, రేఖా, జనని (ఫైల్‌ఫొటో)

- రుణ బాధలు.. కుటుంబ తగాదాలతో ఆరుగురి ఆత్మహత్య

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏం కష్టమొచ్చిందో.. ఎంత నష్టమొచ్చిందోగానీ ఒకే రోజు రెండు కుటుంబాలు బలవన్మరణానికి పాల్పడ్డాయి. సేలం, చెన్నై నగరాల్లో జరిగిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి...

సేలం అరిసిపాళయం ముత్యాల్ వీధిలో బాల్‌రాజ్ (46), రేఖా (40) దంపతులకు జనని (17) అనే కుమార్తె ఉంది. బాల్‌రాజ్ వెండి నగలు, ఆభరణాల తయారీ కర్మాగారాన్ని నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో గత ఏడాది పాల్‌రాజ్ బ్యాంక్‌లో రుణం తీసుకుని రెండంతస్థుల ఇలు నిర్మించాడు. ఆ ఇంటి నిర్మాణ ఖర్చుల కోసం అతడి భార్య కూడా తెలిసినవారి వద్ద అప్పులు చేసింది. ఆ కొత్త ఇంటిలో బాల్‌రాజ్ వెండి నగల తయారీ కర్మాగారాన్ని నడుపుతున్నాడు. ఇటీవల వెండి నగల వ్యాపారం తగ్గుముఖం పట్టడంతో వెండి నగల పనులు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో బాల్‌రాజ్ సంపాదన లేక ఇబ్బందులు పడ్డాడు. అదే సమయంలో రుణమిచ్చిన బ్యాంక్ అధికారులు బాల్‌రాజ్‌పై, అప్పులిచ్చిన చుట్టుపక్కలి వారు రేఖపై ఒత్తిడి తెచ్చారు. కొద్ది నెలలుగా బాల్‌రాజ్ బ్యాంక్ నెల వాయిదాలు కూడా సక్రమంగా చెల్లించలేకపోయాడు. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం బ్యాంక్ ఉన్నతాధికారులు బాల్‌రాజ్ ఇంటికి వెళ్లి రుణం తీర్చమంటూ దుర్భాషలాడినట్లు తెలుస్తోంది. మంగళవారం లోగా రుణ బకాయిలు పూర్తిగా చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని బెదిరించారు. దీంతో ఆ దంపతులు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం రాత్రి బెడ్‌రూంలో బాల్‌రాజ్, రేఖా, వారికుమార్తె జనని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం ఉదయం బాల్‌రాజ్ ఇంటి నుండి ఎలాంటి అలికిడి లేకపోవటంతో చుట్టుపక్కల వారు లోపలకు వెళ్ళి చూశారు. పడకగదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సేలం నగర పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో ఆ ఇంటి గదిలో ఆత్మహత్య చేసుకోవటానికి ముందు బాల్‌రాజ్ రాసిన లేఖ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో బాల్‌రాజ్‌కు రుణాలిచ్చినవారి కోసం దిగ్భ్రాంతికరమైన విషయాలను రాసిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా లేఖలోని వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

కుటుంబ కలహాలతో ముగ్గురు...

స్థానిక తేనాంపేటలో కుటుంబ తగాదాలకు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. తేనాంపేట కృష్ణావీధిలో శరవణన్, జయంతి (35) అనే దంపతులకు ఎనిమిదేళ్లలోపు వయస్సు ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం జయంతి తన ఇద్దరు కుమార్తెలను కత్తితో గొంతుకోసి, తాను కూడాటగొంతునుకోసుకుంది. అనంతరం నొప్పి తాళలేక కేకలు పెట్టింది. దీంతో చుట్టుపక్కలి వారు అక్కడికెళ్లి చూడగా, అప్పటికే ముగ్గురూ రక్తపు మడుగులో పడివున్నారు. సమాచారం తెలుసుకున్న తేనాంపేట పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలన పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ తగాదాల కారణంగా జయంతి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

ఈడీ విచారణకు మళ్లీ కదిర్ ఆనంద్

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సీనియర్ నేత, వేలూరు ఎంపీ, కదిర్ ఆనంద్ ఈడీ కార్యాలయంలో మంగళవారం రెండోసారి విచారణకు హాజరయ్యారు. డీఎంకే ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్ కుమారుడు కదిర్ ఆనంద్ 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వేలూరు నియోజకవర్గం నుంచి పోటీచేశారు. ఆ సమయంలో ఎన్నిక నియమాళిని ఉల్లంఘించి ఓటర్లకు నగదు బట్వాడా చేసేందుకు యత్నించారని కదిర్ ఆనంద్‌పై ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఈడీ అధికారులు ఈ నెల 3వ తేదీ వేలూరు జిల్లా కాట్పాడి ప్రాంతంలోని కింగ్‌స్టన్ ఇంజనీరింగ్ కళాశాల, కాట్పాడిలోని ఎంపీ ఇల్లు, డీఎంకే నేత పూంజోలై శ్రీనివాసన్, బంధువు దామోదరన్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో కింగ్‌స్టన్ కళాశాలలో రూ.13.7కోట్లు, కదిర్ ఆనంద్ ఇంటి లాకరులో రూ.17లక్షలు, పూంజోలై శ్రీనివాసన్ ఇంట్లో రూ.28లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఎంపీ కదిర్ ఆనంద్ ట్రస్టులకు సంబంధించిన కీలక పత్రాలు, హార్డ్‌డిస్కులు, డిజిటల్ నగదు లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించిన అధికారులు వాటిలో కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నాలుగు రోజుల తనిఖీలపై చేపట్టిన ఈ నెల 22న జరిపిన విచారణకు కదిర్ ఆనంద్ హాజరు కాగా, అధికారులు సుమారు 10 గంటలపాటు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో ఈడీ అధికారుల ఆదేశాల మేరకు కొన్ని కీలక పత్రాలతో మంగళవారం వేలూరు ఎంపీ మళ్లీ ఈడీ కార్యాలయంకు రాగా, ఈడీ అధికారులు విచారణ జరిపారు.

సమాజాన్ని ప్రతిబింబించేది ఉమర్ ఆలీషా సాహిత్యం

- 'సాహిత్య సదస్సు' ముగింపోత్సవంలో భువనచంద్ర



సత్కారగ్రహీతలతో ఆచార్య విస్తాలి శంకరరావు, సినీగేయ రచయిత భువనచంద్ర తదితరులు

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమర్ అలీషా పరిచయం తెలుగు సాహితీలోకానికి తక్కువైనా, ఆయన కలం నుండి జాలువారిన సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించేదిగా ఉంటాయని ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర అన్నారు. .మద్రాసు విశ్వ విద్యాలయ తెలుగుశాఖ అధ్వర్యంలో 'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం - బహుముఖీనత' అనే అంశంపై నిర్వహించిన రెండురోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. మెరీనాలోని రజతోత్సవ ప్రాంగణంలో మద్రాస్ వర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్‌రావు అధ్యక్షతన సోమవారం ప్రారంభమైన రెండ్రోజుల సాహితీ వేడుకల్లో తెలుగు భాష మాధుర్యం, ఉమర్ ఆలీషా సాహిత్యంపై పలువురు ప్రసంగించారు. మంగళవారం మధ్యాహ్నం 3.30గంటలకు జరిగిన సదస్సు సమాపనోత్సవానికి భువనచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై ఉమర్ ఆలీషా సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించిన ఆచార్య విస్తాలి శంకరరావు, నిర్వాహకులను అభినందించారు. అనంతరం డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ.. తమ తాతగారైన ఉమర్ అలీషాను ప్రపంచానికి పరిచయం చేయడానికి మద్రాస్ యూనివర్శిటీ మంచి వేదికని, ఈ సదస్సు సాహితీప్రియులను ప్రోత్సహిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విశిష్ట అతిథి తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ.. బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా తెలుగు సాహితీలోకానికి దొరికిన ఒక మణిహారమని కొనియాడారు. ఉమర్ ఆలీషా బహుముఖీయమైన వ్యక్తి అని ప్రత్యేక అతిథి నడింపల్లి తిరుపతి వెంకటప్రసాద్ వర్మ కీర్తించారు. సాహిత్య సంపద సృష్టించి తెలుగు సాహిత్య చరిత్రలో తెలుగు గడ్డకు చెందిన ముస్లిం కవుల్లో ఆచార్య ఉమర్ అలీషా ప్రత్యేకస్థానం దక్కించుకున్నారని ఆత్మీయ అతిథి ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ కొనియాడారు. సమాపనోత్సవంలో వంజరపు శివయ్య, డాక్టర్ ఆయల సోమయాజుల గోపాలరావు, ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు ప్రసంగించారు. రెండో రోజున జరిగిన నాలుగు సమావేశాలకు డా.మాదా శంకరబాబు, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, డా. కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి, చింతాడ చిన్నోడు అధ్యక్షత వహించారు. డా.పాండురంగం కాళియప్ప స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో మొత్తం 28పత్రాలు సమర్పించారు. చివరగా పసల చైతన్యకుమార్‌రెడ్డి వందన సమర్పణతో అంతర్జాతీయ సాహిత్య సదస్సు ముగిసింది.

లంక నావికాదళం దాష్టీకం

- తుపాకీతో బెదిరించి జాలర్ల అరెస్టు

అడయార్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత సముద్ర జలాల సరిహద్దులను దాటి తమ దేశ జలాల్లోకి ప్రవేశించి చేపలుపడుతున్నారని ఆరోపిస్తూ శ్రీలంక నావికా దళం తమిళ జాలర్లపై ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తోంది. తాజాగా సముద్రంలో చేపలు వేటాడుతున్న 13 మంది జాలర్లను తూపాకీతో బెదిరించి అరెస్టు చేసింది. వారి నుంచి తప్పించుకునేందుకు ఇద్దరు జాలర్లు సముద్రంలోకి దూకటంతో గాయపడ్డారు. ఈ నెల 25న రామేశ్వరం ప్రాంతానికి చెందిన 34 మంది జాలర్లను లంక నావికా దళం అరెస్టు చేసిన విషయం తెల్సిందే. వీరిని విడుదల చేయాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన జాలర్లు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగపట్టణం, కారైక్కాల్ ప్రాంతాలకు చెందిన 13 మంది జాలర్లపై కాల్పులు జరిపి అరెస్టు చేసింది. కారైక్కాల్ ప్రాంతం ఆనందవేల్‌కు చెందిన మరబోటులో కారైక్కాల్ హార్బర్ నుంచి కిలింజల్‌మేడు, పట్టినచ్చేరి, మైలాడుదురై జిల్లా చంద్రపాడి, వాణగిరి, నాగపట్టణం జిల్లా నంబియార్ నగర్‌కు చెందిన 13 మంది జాలర్లు రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం వారిని చుట్టుముట్టిన లంక నావికాదళం.. తుపాకులు ఎక్కుపెట్టింది. తమ జలాల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ దాడికి పాల్పడింది. అనంతరం 11 మందిని అరెస్టు చేసింది. వారి నుంచి తప్పించుకునేందుకు సముద్రంలోకి దూకిన ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుంది. కాగా వారందరినీ జాఫ్నాకు తరలించిన లంక నావికాదళం.. గాయపడిన వారిని అక్కడి ఆస్పత్రిలో చేర్పించింది. ఈ సమాచారం తెలియగానే తీరప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. తక్షణం తమ వారిని విడిపించాలని డిమాండ్ చేస్తూ పలు చోట్ల జాలరులు ఆందోళనకు దిగారు.

గవర్నర్ పదవికి రవి అనర్హుడు

- టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

అడయార్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ద్వేషపూరిత రాజకీయ ప్రసంగాలు చేస్తున్న ఆర్‌ఎన్ రవి రాష్ట్ర గవర్నర్ పదవికి అనర్హులని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై విమర్శించారు. ఈ విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కడలూరు జిల్లా చిదంబరంలో జరిగిన స్వామి సహజానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ సామాజిక న్యాయం, సమానత్వం పేరుతో షెడ్యూల్ తెగల ప్రజలను ఒక దుష్టశక్తి విభజిస్తుంది' అని వ్యాఖ్యానించారన్నారు. అణగారిన వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లను కల్పించి సమాజిక న్యాయం, సమానత్వం కల్పించడంలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం 1950 అమల్లోకి వచ్చిన వెంటనే కమ్యూనల్ జీవో చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దానికి వ్యతిరేకంగా తిరుచ్చిలో తంథై పెరియార్ ఆందోళన చేశారని గుర్తుచేశారు. ఈ విషయాన్ని కామరాజర్.. నాటి ప్రధాని నెహ్రూ దృష్టికి తీసుకెళ్ళగా, భారత రాజ్యాంగంలో తొలి సవరణ చేసి రిజర్వేషన్లను పరిరక్షించారన్నారు. ఇప్పటివరకు రిజర్వేషన్లకు రక్షణ కవచంగా ఉండటానికి ప్రధాన కారణం తమిళనాడు అని గర్వంగా చెప్పవచ్చన్నారు. ఒక దుష్టశక్తి రాష్ట్రాన్ని విభజిస్తుందని గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారో తెలియడం లేదన్నారు. భారత రాజ్యాంగం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని మోహన్ భగవత్ వంటి వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచారన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆదిద్రావిడ ప్రజలకు కల్పిస్తున్న రిజర్వేషన్లు, డాక్టర్ అంబేడ్కర్‌నే గవర్నర్ ఒక దుష్టశక్తితో పోల్చారని భావించాల్సి ఉందన్నారు. ఇలా సమాజంలో ద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్న ఆర్‌ఎన్.రవి రాష్ట్ర గవర్నర్ పదవికి ఏమాత్రం అర్హుడు కాదని సెల్వపెరుందగై వ్యాఖ్యానించారు.

సమాచార దర్శిని

'ఆదర్శ' పురస్కారానికి హిజ్రాలకు అవకాశం

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది హిజ్రాల పురోగతికి సేవలందిస్తున్న వారికి 'ఆదర్శ' పురస్కారం అందజేస్తోంది. ఆ ప్రకారం, 2024-25వ సంవత్సర పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుదారులు ప్రభుత్వ సహాయం అందుకోకుండా స్వయంగా సేవలు చేస్తుండాలి, సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉండకూడదు, నేరచరిత్ర లేని వారై ఉండాలి. ఆసక్తి కలిగిన వారు awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ జాక్డే ఒక ప్రకటనలో తెలిపారు.

పూందమల్లి ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ విభాగం

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ విభాగం ఏర్పాటైంది. ఈ ఆస్పత్రిలో పూందమల్లి, చుట్టుపక్కల 28 పంచాయతీలకు చెందిన ప్రజలు చికిత్స పొందుతుంటారు. ఈ నేపథ్యంలో, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత డయాలసిస్ సేవలు అందించేలా రూ.20 లక్షలతో డయాలసిస్ విభాగం ఏర్పాటైంది. ఈ కేంద్రాన్ని సోమవారం పూందమల్లి డీఎంకే ఎమ్మెల్యే కృష్ణస్వామి ప్రారంభించారు.

ట్రేడ్ ఫెయిర్‌కు పెరుగుతున్న సందర్శకులు

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన ట్రేడ్ ఫెయిర్‌ను ఆదివారం వరకు 1.82 లక్షల మంది సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి 46 స్టాల్స్ ఫుడ్ కోర్టు, అమ్యూజ్‌మెంట్ పార్క్ సహా పలు వినోద కార్యక్రమాలతో ఈ నెల 6వ తేది ట్రేడ్ ఫెయిర్ ప్రారంభించారు. రిపబ్లిక్ దినోత్సవమైన ఆదివారం ఒక్కరోజే 20,697 మంది ట్రేడ్ ఫెయిర్‌ను సందర్శించగా, ఇప్పటివరకు మొత్తం 1.82 లక్షల మంది వీక్షించారు. మార్చి నెలాఖరు వరకు జరుగనున్న ఈ ట్రేడ్ ఫెయిర్ ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.25 వసూలుచేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

'సీఎం ఫార్మశీ' ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'సీఎం ఫార్మశీ' దుకాణాలు ఏర్పాటుచేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా జెనరిక్, ఇతర మందులు తక్కువ ధరకు అందించేలా తొలి విడతగా వెయ్యి మందుల దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, ఈ దుకాణాలు ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. అభ్యర్థులు బి.ఫార్మ్, డి.ఫార్మ్ తదితర కోర్సులు చేసి ఉండాలి. దుకాణం ఏర్పాటుకు సొంత, అద్దె స్థలం ఉండాలి. ఈ దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీగా రూ.3 లక్షలు, మందులు అందజేస్తుంది. నగరంలో ఈ దుకాణాలు ఏర్పాటుచేసేందుకు ఆసక్తి ఉన్న వారు http://www.mudhalvar-marundhagam.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 5వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

చెన్నై - దిండివనం మధ్య రహదారి విస్తరణ

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రించే దిశగా చెన్నై - దిండివనం జాతీయ రహదారిలో కరుంగులి - పూంజేరి మధ్య 32 కిలోమీటర్లకు కొత్తరోడ్డు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రధానమైన పండుగలు, వరుస సెలవుల రోజుల్లో చెన్నై - దిండివనం జాతీయరహదారిలో సొంతూళ్లకు వాహనాల్లో వెళ్లేవారితో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ సమస్యను పరిష్కరింపజేసేలా రాష్ట్రప్రభుత్వం చెంగల్పట్టు జిల్లా మదురాంతకం సమీపంలో ఉన్న కరుంగులి నుంచి ఈస్ట్‌కోస్టు రోడ్డులో ఇరుకుగావున్న రోడ్డును 32కిలోమీటర్ల మేర విస్తరింపజేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.80లక్షలతో ప్లాన్ సిద్ధంచేసి, తమిళనాడు రోడ్డు అభివృద్ధి సంస్థ కమిషన్ టెండర్లు ఆహ్వానించింది. ఈరోడ్డు అందుబాటులోకి వస్తే చెంగల్పట్టు సమీపంలో ఉన్న మదురాంతకం ప్రాంతంలోని కరుంగలి నుండి పూంజేరి మీదుగా వాహనాలను మళ్లించవచ్చు. అందువల్ల త్వరలోనే ఈరోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రహదారులశాఖ అధికారులు తెలిపారు.

నగరంలో రిజిస్ట్రేషన్ శాఖ మ్యూజియం

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాజీ రోడ్డులోని వారసత్వ భవనం, రిజిస్ట్రేషన్ శాఖ గురించి తెలిపేలా రూ.52 లక్షలతో మ్యూజియం ఏర్పాటుకానుంది. బ్రిటీష్ పాలకుల సమయంలో 1865వ సంవత్సరంలో చెన్నై, ముంబై సహా నాలుగు ప్రధాన నగరాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ సులభతరం చేసేలా తాలూకాకు ఒక కార్యాలయం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో రాజాజీ రోడ్డులో 1865లో ప్రారంభించిన కార్యాలయ భవనం శిధిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఆ భవనాన్ని రూ.1.25 కోట్ల తో మ్యూజియంగా మార్చనున్నారు. మ్యూజియంలో పాత డాక్యుమెంట్లు, స్టాంపులు, వేలిముద్రల పెట్టెలు, టైప్‌రైటర్లు సహా రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన పలు వస్తువులు ప్రదర్శనకు ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

నత్తనడకన అనైపాళయం రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం




అలంకార ప్రాయంగా ఉన్న ఫ్లైఓవర్

టి.నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తిరుప్పూరు వంజిపాళయం రహదారిలోని అనైపాళయం రైల్వే ఫ్లైఓవర్ పనులు 18 యేళ్లుగా పెండింగ్‌లో ఉంచడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థల సేకరణ, ఆక్రమణల తొలగింపు, కోర్టుకేసులు అంటూ పలు అడ్డంకులు అధిగమించి 18 యేళ్ల క్రితం డీఎంకే ప్రభుత్వ హయంలో అప్పటి మంత్రి ఎంపీ.సామినాథన్ అధ్యక్షతన అనైపాళయం రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణపనులకు శంకుస్థాపన జరిపారు. ఆరంభంలో చురుకుగా సాగిన ఫ్లైఓవర్ నిర్మాణపనులు, అర్థాంతరంగా ఆగిపోయాయి. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ ప్రాజెక్టు తిరుప్పూరు మహానగర ప్రజల చిరకాల కోరిక అని, తిరుప్పూరు నుంచి ట్రాఫిక్ సమస్య లేకుండా ఇతర జిల్లాలకు రాకపోకలు చేయడానికి ఈ రైల్వే ఫ్లైఓవర్ ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు. తిరుప్పూరు నగరంలో పలు రహదారి వంతెన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలంటూ ఆందోళనలు నిర్వహించిన ఎస్.నందగోపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అనైపాళయం ఫ్లైఓవర్ నిర్మాణ పనులు యేళ్లతరబడి పెండింగ్‌లో ఉంచడంతో అసంపూర్తిగా, అలంకార ప్రాయంగా మారిందని, ఆ ప్రాంతం మందుబాబుల స్థావరంగా తయారైందని తెలిపారు. ఆ రహదారిని కార్పొరేషన్ అధికారులు తారురోడ్డుగా మార్చాలని, అదే సమయంలో 18 యేళ్లుగా ఆగిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వీలయినంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

టెట్ నిర్వహించపోవడం అన్యాయం

● టీటీవీ దినకరన్

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి నిర్వహించాల్సిన టీచర్ అర్హత పరీక్ష (టెట్) ఒకసారి కూడా నిర్వహించకపోవడం అన్యాయమని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ మూడున్నరేళ్లలో ఒక్కసారి కూడా టెట్ నిర్వహించకుండా కాలయాపన చేయడంవల్ల పట్టభద్రులు నష్టపోతున్నారని ఆరోపించారు. జాతీయ టీచర్ విద్యా కౌన్సిల్ నిబంధనల ప్రకారం టెట్ నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం అందుకుగల కారణాలను తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

4న నగరంలో అన్నాడీఎంకే క్షేత్రస్థాయి సర్వే

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే క్షేత్రస్థాయి కమిటీ ఫిబ్రవరి 4న చెన్నై జిల్లాలో సర్వే చేయనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. గ్రామీణస్థాయి నుంచి పార్టీ బలోపేతం, నేతలు-కార్యకర్తల సయోధ్య, ప్రజలతో నేతల సంప్రదింపులు తదితరాలు తెలుసుకొనేలా అన్నాడీఎంకే క్షేత్రస్థాయి పరిశీలన బృందం ఏర్పాటుచేసింది. ఈ బృందం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సర్వే చేస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ బృందం ఫిబ్రవరి 4న చెన్నై జిల్లాల్లో సర్వే చేపడుతుందని ఈపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

టీవీకేలో బూత్ కమిటీలు

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు విజయ్ నిర్వహిస్తున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు బూత్ కమిటీలను నియమించాలని పార్టీఅధిష్ఠానం నిర్ణయించింది. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే ముందస్తు ఏర్పాట్లలోకి దిగింది. రాష్ట్రస్థాయి నిర్వాహకుల నియామకాలతో పాటు 120 జిల్లాల కార్యదర్శుల నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బూత్ కమిటీలను నియమించాల్సిందిగా టీవీకే అధ్యక్షుడు విజయ్ ఆదేశించారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌కు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే బూత్ కమిటీ సభ్యులు 5 నుండి 7 వరకు నియమితులు కావడం గమనార్హం.

మినీ బస్సు ఛార్జీల్లో మార్పు

● మే 1 నుంచి అమలు

ప్యారీస్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నడుపుతున్న మినీ బస్సుల ఛార్జీలు మార్పు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. మే 1వ తేది నుంచి మార్పు చేసిన ఛార్జీలు అమలుకు వస్తాయని ఆదేశించింది. మొదటి నాలుగు కి.మీ వరకు రూ.4, 4 నుంచి 6 కి.మీ వరకు రూ.5, 6 నుంచి 8 కి.మీ వరకు రూ.6 ఛార్జీగా నిర్ణయించింది.

ఈపీఎస్ బినామీ కళాశాలకు గవర్నర్ ఎందుకు వెళ్లారు .?

● ప్రశ్నించిన డీఎంకే

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేత కేసుపై విచారణ జరుగుతున్న సమయంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి బినామి నడుపుతున్న కళాశాలకు ఎందుకు వెళ్లారని అధికార డీఎంకే ప్రశ్నించింది. రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ రవి మీడియాకు రాసిన లేఖలో... డీఎంకే ప్రభుత్వ తీరుపై విమర్శించారు. దీనిపై స్పందించిన డీఎంకే, తరుచ్చి జిల్లా ముసిరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అనే విద్యాసంస్థను పళనిస్వామి కుడి భుజంగా ఉన్న సేలం నగర అన్నాడీఎంకే కార్యదర్శి ఇళంగోవన్‌పై పన్ను ఎగవేత కేసు విచారణ పెండింగ్‌లో ఉందని, ఆ కళాశాలలో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో గవర్నర్ ముఖ్యఅతిథిగా ఎందుకు పాల్గొన్నారని డీఎంకే ప్రశ్న లేవనెత్తింది. ఒక రాష్ట్ర గవర్నర్ అవినీతి కేసులో ఉన్న వ్యక్తి కళాశాలకు వెళ్లడంలో అనుమానం ఉందంటూ అధికార పార్టీ తన ప్రకటనలో తెలిపింది.

ఎంజీఎం హెల్త్‌కేర్ ఒడిసా మహిళకు థైరాయిడ్ చికిత్స



ఒడిసా మహిళతో డాక్టర్ సంజీవ్ మొహంతి

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఎంజీఎం హెల్త్‌కేర్‌లో ఒడిసాకు చెందిన 35 యేళ్ల మహిళకు కణితి తొలగింపు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి ఈఎన్టీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సంజీవ్ మొహంతి తెలిపారు. థైరాయిడ్‌తోపాటు ఆమె కంటి కండరాలు విపరీతంగా ఉబ్బడం వంటి సమస్యలతో బాధపడుతూ తమ ఆస్పత్రిలో చేరిందన్నారు. ఆమెకు ఎండోస్కోపీ ద్వారా థైరాయిడ్ కణితి తొలగించి, కంటి కండరాలను సక్రమపరిచే రెండు రకాల శస్త్రచికిత్సలను ఏకకాలంలో చేసినట్టు వివరించారు.

మురుగన్ హుండీ ఆదాయం రూ.1.19కోట్లు

తిరుత్తణి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి ఆలయంలో స్వామివారికి రూ.1.19కోట్ల హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ జానకి తెలిపారు. తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజు వేలాదిగా భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో 25రోజుల్లో భక్తులు చెల్లించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సురేష్‌బాబు, నాగన్ సమక్షంలో నిర్వహించిన లెక్కింపులో రూ.1.19 కోట్ల నగదు, 233 గ్రాముల బంగారం, 5,128 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఖైదీలతో సఖ్యతగా ఉండాలి

● జైళ్ల శాఖకు మద్రాసు హైకోర్టు సలహా



ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్లలో ఉన్న ఖైదీల పట్ల దురుసుగా ప్రవర్తించకుండా, సఖ్యతగా ఉండాలని జైళ్ల శాఖకు మద్రాసు హైకోర్టు సలహా ఇచ్చింది. నైజీరియాకు చెందిన కింగ్స్లి తరుపున హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లో రాష్ట్రంలోని జైళ్లలో విదేశీ ఖైదీలకు కనీస వసతులు కల్పించడం లేదని, ఖైదీలపట్ల అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తు ఎస్ఎం.సుబ్రమణ్యం, ఎం.జ్యోతిరామన్‌తో కూడిన ధర్మాసనం ముందు సోమవారం విచారణకు వచ్చింది. విదేశీ ఖైదీల సంక్షేమానికి సంబంధించి నిబంధనలున్నాయా? అనే అంశంపై వివరించేందుకు రెండు వారాల అవకాశం కల్పించాలని కేంద్రప్రభుత్వ అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఏఆర్ సుందరేశన్ కోర్టును అభ్యర్థించారు. విదేశీ ఖైదీలకు గత డిసెంబరు నుండి ఉదయం అల్పాహారాన్ని జైళ్లలో ఇవ్వడంలేదని పిటీషనర్ తరుపు న్యాయవాది తెలిపారు. ఇరు తరుపు వాదనల అనంతరం హైకోర్టు ధర్మాసనం విదేశీ ఖైదీలు మాత్రమే కాకుండా జైళ్లలో శిక్ష అనుభవిస్తు ఖైదీలను కూడా మానవతా దృక్పధంతో చూడాలని, వారికి కనీస వసతులను సమకూర్చాలని సూచించారు. ముఖ్యంగా విదేశీ ఖైదీలను చూసుకొనే విధానాన్ని బట్టి ఆయా దేశాల్లో భారతదేశానికి తగిన గౌరవం దక్కుతుందని సలహా ఇచ్చిన న్యాయమూర్తులు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మగా యూజీసీ పనితీరు

రాష్ట్ర హక్కులు కాలరాస్తున్నారు ● మంత్రి చెళియన్ ధ్వజం

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యూజీసీ పనితీరు కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మగా ఉందని ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నా అరివాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర హక్కులు కాలరాసేలా యూజీసీ కొత్త నిబంధనలున్నాయన్నారు. యూజీసీ కొత్త ముసాయిదా నిబంధనలు ఉపసంహరించుకోవాలన్నారు. యూజీసీ కొత్త నిబంధనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభుత్వానికి విద్యలో పూర్తి హక్కులుంటాయన్నారు. యూజీసీ ద్వారా రాష్ట్ర నిధులతో నడిచే యూనివర్సిటీలను స్వాధీనం చేసుకునేందుకు కేంద్రప్రభుత్వం యత్నిస్తోందన్నారు. వీసీల నియామకంలో యూజీసీ జోక్యాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యావేత్తలు కాని వారిని వైస్ ఛాన్సలర్లుగా నియమించాలన్న కొత్త నిబంధనలు దుర్వినియోగమని మంత్రి అభివర్ణించారు. యూజీసీ కొత్త నిబంధనలు ఉన్నత విద్యలో డ్రాపౌట్ రేట్లను పెంచుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే సమయంలో రెండు డిగ్రీ కోర్సులు చదవడం వల్ల పూర్తి అకడమిక్ నాలెడ్జ్ పొందడం సాధ్యం కాదన్నారు. దేశంలో ఉన్నత విద్యలో తమిళనాడు అగ్రస్థానంలో ఉందన్నారు. తమిళనాడు, కేరళ, తెలంగాణా ప్రభుత్వాలు కూడా కొత్త యూజీసీ నిబంధనలు వ్యతిరేకించాయన్నారు. యూజీసీ కొత్త నిబంధనలు వ్యతిరేకిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిబ్రవరి 5వ తేదిలోపు ఈ-మెయిల్ ద్వారా తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు. యూజీసీ కొత్త నిబంధనలు ఉపసంహరించుకొనే వరకు తమిళనాడు ప్రభుత్వం పోరాడుతుందని మంత్రి తెలిపారు.

శ్రీరంగంలో రౌడీ దారుణహత్య

● కుటుంబసభ్యుల రాస్తారోకో



రౌడీ అన్బు (ఫైల్‌ఫోటో)



శ్రీరంగం ఆసుపత్రి వద్ద రాస్తారోకో చేస్తున్న కుటుంబీకులు, బంధువులు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం శ్రీరంగంలో పేరు మోసిన రౌడీ అన్బు (32)ను గుర్తు తెలియని దుండగులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్యచేశారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటన కారణంగా శ్రీరంగం అంతటా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీరంగం మేలూరు రోడ్డు లక్ష్మీనగర్ ప్రాంతంలో నివసిస్తున్న అన్బుపై పలు పోలీసుస్టేషన్లలో హత్య, హత్యాయత్నం, దారిదోపిడీ, కట్ట పంచాయతీ కేసులున్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త రామజయం హత్యకేసులోను నిందితుడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు అన్బు జిమ్‌కు వెళ్లి బైకుపై ఇంటికి తిరిగివస్తుండగా రెండు బైకుల్లో వెంబడించిన నలుగురు దుండగులు శ్రీరంగం తెప్పకుళం వద్ద చుట్టుముట్టి వేటకొడవళ్లు, కత్తులతో దాడి జరిపారు. దీంతో అన్బు తీవ్ర గాయాలతో రక్తపుమడుగులో పడి కొన ఊపిరితో ఉండగా చికిత్స నిమిత్తం శ్రీరంగం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మార్గమధ్యంలో అతడు మరణించినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనగురించి తెలుసుకున్న అన్బు భార్య, కుటుంబ సభ్యులు శ్రీరంగం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట గుమికూడి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. హత్య జరిగిన ప్రాంతం శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ ప్రాంతం కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హత్య జరిగిన వెంటనే చాలా మంది భక్తులు తమ వాహనాలను అక్కడి తరలించేందుకు ఒకేసారి వచ్చారు. శ్రీరంగం పోలీసులు కేసు నమోదు చేసుకుని హంతకుల ఆచూకీకోసం గాలిస్తున్నారు.

తిరుప్పరంగుండ్రంపై జంతు బలుల వ్యవహారం

● జిల్లా కలెక్టర్‌కు నోటీసు

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలోని తిరుప్పరంగుండ్రం కొండపై కోళ్లు, మేకలను బలివ్వడం నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. తిరుప్పరంగుండ్రం పుణ్యక్షేత్రంలోని కొండపై జంతు బలులు నిషేధించాలని కోరుతూ హిందూ మక్కల్ కట్చి అధ్యక్షుడు చోలైకన్నన్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. తిరుప్పరంగుండ్రంలో పాండ్య రాజులు కొండపై ఈ ఆలయాన్ని నిర్మించారని పిటిషన్‌లో తెలిపారు. విశ్వనాధర్ సన్నిధి, దీప స్తంభం, స్థలవృక్షం, ఉమైఆండవర్ గుహ, 11 తీర్థ కొలనులతో సుప్రసిద్ధ శైవక్షేత్రంగా తిరుప్పరంగుండ్రం ఆలయం ఉందని, కొండ శిఖరంపై సికిందర్ బాదుషా దర్గా ఉందని, దర్గా ఆధ్వర్యంలో ఈ నెల 19 వ తేది కోళ్లు, మేకలు బలిచ్చి సహపంక్తి భోజనం ఏర్పాటుచేశారని, భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా నిషేధం విధించాలని ఆ పిటిషన్‌లో కోరారు. మంగళవారం హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి ఎమ్మెస్ రమేష్, మరియాగ్లాడ్‌లతో కూడిన ధర్మాసనం సమక్షంలో విచారణకు వచ్చింది. ఈ ఫిర్యాదుకు సంబంధించి పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వ తరఫు న్యాయవాది తెలిపారు. అనంతరం పిటిషనర్‌కు వివరణ సమర్పించాల్సిందిగా మదురై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇన్‌ఛార్జి హెచ్ఆర్‌డీ జాయింట్ కమిషనర్, తహసీల్దార్, సికిందర్ భాషా దర్గా యాజమాన్యానికి ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ తేది ప్రకటించకుండా వాయిదావేశారు.

సీఎస్‌తో ఐఎఫ్ఎస్ అధికారుల బృందం భేటీ

అడయార్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా కీళడిలో జరుగుతున్న పురావస్తు తవ్వకాలను పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారుల బృందం మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందంతో సచివాలయంలో సమావేశమయ్యారు. గోబిల్లా కృష్ణ శ్రీవత్సవ్, కృష్ణకుమార్, అనుజా, సత్యంద, హరిశంకర్, అబ్దుల్ ఫజల్, గోకుల్ కృష్ణ తదితరులు సీఎస్‌ను కలుసుకున్నవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు కీళడిలో జరుగుతున్న పురావస్తు తవ్వకాలు, అక్కడ బయల్పడిన వస్తుసామాగ్రి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్ఐకి మూడేళ్ల జైలు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో అవినీతి కేసులో ఎస్ఐకి రెండుసెక్షన్లకింద తలా మూడేళ్ల జైలుశిక్ష విధించారు. నాగర్‌కోయిల్ సీడీ దుకాణ యజమాని కన్నన్ దగ్గర ఎస్ఐ రూ.50వేల లంచం తీసుకున్నారనే కేసులో వడచేసి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజశేఖర్‌కు జైలు శిక్షతో పాటు రూ.20వేలజరిమానా విధిస్తూ నాగర్‌కోయిల్ కోర్టు తీర్పునిచ్చింది.

బాలికపై అత్యాచారం కేసులో వృద్ధుడికి 103 ఏళ్ల జైలుశిక్ష

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ జిల్లా మన్నార్గుడి సమీపంలోని ఓ ప్రాంతంలో 12ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన వృద్ధుడికి మహిళాకోర్టు 103 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. తలయామంగళం వడప్పాది కంబర్ వీధికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు 2019వ సంవత్సరంలో 12ఏళ్ల మైనర్ బాలికను ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని ఫోక్సో చట్టంకింద అరెస్టు చేశారు. కొన్నేళ్ల తర్వాత బెయిల్‌పై విడుదలైన నిందితుడు విచారణ నిమిత్తం కోర్టుకు హాజరుకాలేదు. దీంతో అతడిపై అరెస్టు వారెంటు జారీకావడంతో పోలీసులు మళ్లీ అరెస్టు చేసి నాగపట్నం జైలుకి తరలివచారు. ఈ కేసు తుదివిడత విచారణకు సోమవారం తిరువారూర్ మహిళా కోర్టులో హాజరుపరచారు. నిందితుడికి 103 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.19వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శరత్‌రాజ్ సంచలనాత్మక తీర్పు వెలువరించారు. జైలుశిక్షను నిందితుడు ఏకకాలంలో అనుభవించాలని ఆదేశించిన న్యాయవాది బాధిత చిన్నారికి రాష్ట్రప్రభుత్వం తరుపున రూ.7లక్షల ఆర్థికసాయం అందించాలని ఉత్తర్వులు జారీచేశారు.

కొకైన్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైమేడు ప్రాంతంలో కొకైన్ తో ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులకు అందిన సమాచార మేరకు సోమవారం చూలైమేడు అన్నా ఫ్లైఓర్ - రాఘవన్ రోడ్డు జంక్షన్‌లో గస్తీ నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ కొకైన్‌ను విక్రయించడానికి ప్రయత్నించిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా వారు రాయపేట శ్రీనివాస పెరుమాళ్ కోవెల వీధికి చెందిన ఫయాజ్ అహ్మద్, కోయంబేడు వాసి చంద్రశేఖర్ అని తెలిసింది. విచారణ అనంతనం వారి నుంచి రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు, 3.93 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని మంగళవారం ఉదయం కోర్టు హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

మదురైలో టీఎన్‌హెచ్‌బీ ఆస్తుల జప్తు



కార్యాలయంలో పరికరాలు జప్తు చేస్తున్న కోర్టు సిబ్బంది

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మదురైలో తమిళనాడు హౌసింగ్ బోర్డు (టీఎన్‌హెచ్‌బీ)కు 92 సెంట్ల స్థలం ఇచ్చిన వ్యక్తికి సకాలంలో నష్టపరిహారం చెల్లించని కారణంగా టీఎన్‌హెచ్‌బీ ఆస్తులు మంగళవారం జప్తు చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. టీఎన్‌హెచ్‌బీ పథకానికి మురుగస్వామి కుటుంబీకులు 92 సెంట్ల భూమి ఇవ్వగా, రూ.11 లక్షలు మాత్రమే ఇచ్చి, మిగతా రూ.30 లక్షలు 30 ఏళ్లుగా ఇవ్వలేదని బాధిత కుటుంబం మదురై హైకోర్టు బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాకీ ఉన్న నగదు చెల్లించని మదురై టీఎన్‌హెచ్‌బీ కార్యాలయంలోని వస్తువులు జప్తు చేయాల్సిందిగా ఆదేశించింది. దీంతో, ఎస్ఎస్ కాలనీలో ఉన్న టీఎన్‌హెచ్‌బీ కార్యాలయానికి వెళ్లిన కోర్టు సిబ్బంది, అక్కడున్న ఫర్నిచర్ తదితరాలను జప్తు చేస్తున్నట్లు నోటీసులు అంటించారు.

పడవ మునిగి ఇద్దరు జాలర్ల మృతి

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెరీనాబీచ్‌లో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు జాలర్లు పడవ బోల్తాపడటంతో నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానిక ట్రిప్లికేన్ నడుకుప్పం ప్రాంతానికి చెందిన భాస్కర్ (61), రాజీ (35) అనే ఇద్దరు జాలర్లు మెరీనా తీరంలో నాటుపడవలో చేపలవేటకు సముద్రంలోకి వెళ్లారు. అరగంటలోపే వారి పడవ బోల్తాపడటంతో ఇద్దరు నీట మునిగి మరణించారు. వారి మృతదేహాలు తీరానికి కొట్టుకువచ్చాయి. వారి పడవ వివేకానందర్ ఇల్లమ్ సమీపంలో ఒడ్డుకు చేరింది. ఈ సమాచారం అందుకున్న మెరీనా పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

కడుపులో బ్యాండేజీ ఉంచి కుట్లు

● ప్రైవేటు ఆస్పత్రికి రూ.10 లక్షల జరిమానా

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిజేరియన్ అనంతరం కడుపులో బ్యాండేజ్ వేసి కుట్లు వేయడంతో బాధపడిన మహిళకు సదరు ఆస్పత్రి నష్టపరిహారం చెల్లించాలని చెన్నై వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు జారీచేసింది. తండయార్‌పేటకు చెందిన ప్రీతికి సిజేరియన్ ద్వారా మగశిశువుకు జన్మనిచ్చింది. ప్రీతికి కుట్లు వేసిన ప్రాంతంలో రక్తం గడ్డకట్టడంతో రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, కడుపులో బ్యాండేజీని గుర్తించి తొలగించారు. శస్త్రచికిత్సలో నిర్లక్ష్యం వహించిన ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం రూ.20 లక్షల పరిహారం ఇచ్చేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ చెన్నై వినియోగదారుల ఫోరంలో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన ఫోరం... బాధితురాలికి చికిత్స నిమిత్తం రూ.3.26 లక్షలు, కేసు ఖర్చులకు రూ.10వేలు పరిహారంగా రూ.10 లక్షలు మొత్తం రూ.13.36 లక్షలు చెల్లించాలని వినియోగదారులు ఫోరం ఉత్తర్వులు జారీచేసింది.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వాహకుల నియామకం

తిరుత్తణి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వన్నియర్‌చత్రంలో తమిళనాడు నిర్మాణ కార్మికుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో తిరువళ్లూరు పశ్చిమ కమిటీ సమావేశం జరిగింది.. ఈ కార్యక్రమానికి తమిళనాడు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మెన్ పొన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్‌కుమార్ మాట్లాడుతూ, నిర్మాణ కార్మికుల పిల్లలు క్రీడల్లో రాణిస్తే వారికి ప్రోత్సాహకంగా సంక్షేమ బోర్డు ద్వారా రూ.50వేలు అందిస్తామని తెలిపారు. ఈ బోర్డులో చేరిన వ్యక్తి మరణిస్తే వారి కుటుంబానికి రూ. 2లక్షల వరకు ఆర్థికసాయం చేస్తామని తెలిపారు. అదేవిధంగా కొత్తగా నిర్వాహక సభ్యులను ఎన్నుకున్నందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సుందరరాజ్, జిల్లా ఛైర్మెన్ మణి, జిల్లా కార్యదర్శి వేలును ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వందలాది కార్మికులు పాల్గొని సభను విజయవంతంచేశారు.

పార్టీలో యువతకు ప్రాముఖ్యత

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్



డీఎంకే యువజన విభాగం కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యేలు ఎస్.చంద్రన్, రాజేంద్రన్

తిరుత్తణి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో మంగళవారం డీఎంకే యువజన విభాగం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన మండల కన్వీనర్లు, ఉప కన్వీనర్లను నియమించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎస్.చంద్రన్, రాజేంద్రన్ పాల్గొని స్థానిక యువతను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, డీఎంకేలో యువతకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నామని, సీఎం స్టాలిన్ కూడా యువతను ఎంతగానో ప్రోత్సహిస్తారన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు అందరూ సిద్ధమవ్వాలని దిశానిర్దేశం చేశారు. యువత చిత్తశుద్ధితో కృషిచేసి పార్టీకి మరింత పేరుతీసుకురావాలని పిలుపునిచ్చారు.

అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శులుగా నలుగురి నియామకం

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శులుగా నలుగురు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రులు వేలుసామి, ముల్లైవేందన్, డా.వి.మైత్రేయన్, ఆర్.చిన్నస్వామిలను నియమిస్తున్నట్లు పళనిస్వామి ప్రకటనలో తెలిపారు.



మురుగదాస్ - శివకార్తికేయన్

దీపావళి రేసులో ఎస్కే మూవీ?

హీరో శివకార్తికేయన్ (ఎస్కే) సినీ కెరీర్‌లో 'అమరన్' బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. గత యేడాది దీపావళి కి విడుదలైన ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించగా, కమల్ హాసన్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ మూవీ భారీ వసూళ్ళను సాధించడంతో పాటు ఎస్కే మార్కెట్‌ను కూడా ఒక్కసారిగా పెంచేసింది. ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్, సుధా కొంగరా, శిబి చక్రవర్తి దర్శకత్వాల్లో నటిస్తున్నారు. ఏఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించే 23వ చిత్రాన్ని ఈ యేడాది దీపావళికి విడుదల చేయాలని భావిస్తున్నారు. 2023 దీపావళికి ఎస్కే నటించిన 'ప్రిన్స్', కార్తి నటించిన 'సర్దార్' విడుదలకాగా, వీటిలో 'ప్రిన్స్' ప్రేక్షకులను నిరాశపరిచింది. కానీ, గత యేడాది దీపావళికి వచ్చిన 'అమరన్' బ్లాక్‌బస్టర్ మూవీగా నిలిచింది. ఈ సెంటిమెంట్‌తో తన 23వ మూవీని దీపావళికి విడుదల చేయాలని భావిస్తున్నారు.



8న సింగర్ చిత్ర లైవ్ కాన్సర్ట్

తమిళ చిత్రజ్యోతి

ప్రముఖ సినీ నేపథ్య గాయని చిత్ర తన కెరీర్‌లోనే తొలిసారి ఒక లైవ్‌కాన్సర్ట్ ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 8వ తేదీ నందనంలోని వైఎంసీఏ మైదానంలో ఈ సంగీత విభావరి జరుగనుంది. మూడు గంటల పాటు ఈ మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్టు మంగళవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో చిత్ర వెల్లడించారు. కెనరా బ్యాంకు, నాయిస్ అండ్ గ్రెయిన్స్ సహకారంతో ఈ-లాంజ్ ఈవెంట్స్ ఈ లైవ్‌కాన్సర్ట్‌ను నిర్వహించనుంది. ఈ మ్యూజికల్ నైట్ ప్రవేశ టిక్కెట్ ధరలు కూడా రూ.499 నుంచి రూ.4 వేల వరకు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ప్లాన్ చేసినట్టు నాయిస్ అండ్ గ్రెయిన్స్ డైరెక్టర్లలో ఒకరైన ఏ.మహావీర్ వెల్లడించారు. సింగర్ చిత్ర కెరీర్‌లోనే ఈ తరహా కాన్సర్ట్ నిర్వహించలేదన్నారు. ఆమె పుట్టిన గడ్డగా భావించే చెన్నై నగరంలోనే ఈ తరహా కొత్త జర్నీ ప్రారంభించాలని ఆమె నిర్ణయం తీసుకుని, ఇందుకు అంగీకరించారన్నారు. ఈ షో టిక్కెట్లు బుక్‌మై షో, ఇన్‌సైడర్.ఇన్‌లో విక్రయానికి అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు.

దర్శకురాలిగా మారిన హీరోయిన్

'వదంది' అనే వెబ్‌సిరీస్ ద్వారా పరిచయమైన హీరోయిన్ సంజన కృష్ణమూర్తి దర్శకురాలిగా మారనుంది. 'వదంది'లో నటించిన తర్వాత ఆమె 'లబ్బర్ పందు'మూవీలో హీరోయిన్‌గా నటించి, మంచి గుర్తింపుతో పాటు ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. అయితే, దర్శకురాలు కావాలన్న బలమైన కోరికతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సంజన... ప్రస్తుతం దర్శక దిగ్గజం మణిరత్నం డైరెక్ట్ చేస్తున్న 'థగ్‌లైఫ్' మూవీ కోసం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇపుడు సంజన కెవిన్ హీరోగా రూపొందనున్న మూవీకి దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

సంజన కృష్ణమూర్తి →



కెవిన్





అడవి నుంచి కొయ్యను తీసుకొస్తున్న భక్తులు

మాసాని ఆలయంలో

నేటినుంచి అగ్నిగుండం వేడుకలు

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా ఆనైమలై మాసాని అమ్మన్ ఆలయ అగ్ని గుండం వేడులకు 81 అడుగుల ధ్వజసంభాన్ని ఆలయానికి తీసుకొచ్చారు. ఈ ఆలయంలో నిర్వహించే అగ్నిగుండం వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. బుధవారం తై అమావాస్య సందర్భంగా వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. అందుకోసం సుమారు 200 మంది భక్తులు సోమవారం సాయత్రం సర్కారపతి అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఆ ప్రాంతంలో చెట్లు పరిశీలించి 81 అడుగుల ఎత్తైన చెట్టును ధ్వజస్తంభం కోసం ఎంపిక చేశారు. చెట్టును నరికి పసుపు, కుంకుమ రాసి పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆ చెట్టును తీసుకుని 17 కి.మీ దూరంలో ఉన్న ఆలయానికి చేరుకున్నారు. వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 11వ తేది శ్మశానకొల్ల, 12న శక్తి కుంభస్థాపనం, మహా పూజ, 13న గుండం తవ్వడం, 14న భక్తులు అగ్నిగుండం ప్రవేశం తదితర కార్యక్రమాలుంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పోలీసు జాగిలానికి 'హ్యాపీ బర్త్‌డే'

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముధుమలైలో అటవీ శాఖ జాగిలం 'టైగర్' నాలుగో జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి నిర్వహించారు. ముధుమలై అటవీ శాఖ చెక్‌పోస్టులో వాహన తనిఖీలు, నేరాలు అడ్డుకోవడం, దొంగల ఆచూకీ పసిగట్టడం తదితరాల్లో అటవీ శాఖకు టైగర్ సహకరిస్తోంది. టైగర్ జన్మదిన వేడుకలు తెప్పకాడు ఏనుగుల శిబిరంలో మంగళవారం నిర్వహించారు. మధుమలై డిప్యూటీ డైరెక్టర్ విద్య కేట్ కట్ చేశారు. అనంతరం ఫారెస్ట్ రేంజర్లు శివకుమార్, విజయ్, కులోత్తుంగచోళన్, అటవీ సిబ్బంది టైగర్‌కు కేక్ తినిపించారు.



జాగిలానికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

నేడు తై అమావాస్య
రామేశ్వరంలో ప్రత్యేక పూజలు

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తై అమావాస్య పురస్కరించుకొని రామనాధపురం జిల్లా రామేశ్వరం ఆలయంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రామేశ్వరం ఆలయానికి ఆడి అమావాస్య, పురటాసి మహాలయ అమావాస్య, ఇతర అమావాస్య రోజుల్లో పెద్దసంఖ్యలో వెళ్లే భక్తులు అగ్నితీర్థంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారి దర్శనం చేసుకుంటారు. అనంతరం సముద్రతీరంలో తమ పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ఈ ఏడాది తై అమావాస్య సందర్భంగా రామేశ్వరం అగ్నితీర్థంలో స్నానామాచరించేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. రామేశ్వరం ఆలయ ప్రాంగణంలో ఉన్న 22 తీర్థ బావుల్లో స్నానాలకు ఏర్పాట్లు కల్పించారు. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు రామనాథస్వామి ఆలయాన్ని తెరచి సాయంత్రం5.30గంటల వరకు స్పటికలింగ దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంతాల్లో పితృదేవతలకు తర్పణాలు సమర్పించేందుకు వెళ్లే భక్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పించింది.

2,553 మంది వైద్యులకు త్వరలో ఉత్తర్వులు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం



ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2,553మంది డాక్టర్లకు త్వరలో పర్మినెంటు నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమమణ్యం పేర్కొన్నారు. సైదాపేటలో ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు రూ.4.51కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనం పనులను, అలాగే నందనం ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాల ప్రాంగణంలో రూ.4.70కోట్లతో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులను మంత్రి సుబ్రమణ్యం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్రాస్ ప్రిసీడియంలో నందనంలో ప్రారంభించిన ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో వెయ్యి మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు కూర్చుని కార్యక్రమాలను వీక్షించేలా ఏసీతో ఆడిటోరియం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరతను తీర్చి రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించేలా వైద్యుల పోస్టులకు రాత పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసిన 2,553 మందికి త్వరలోనే ఉత్తర్వులు అందజేయనున్నట్లు తెలిపారు.

కొవిడ్ టైంలో వైద్యులకు ప్రత్యేక మార్కులు

పెరంబూర్: కొవిడ్ సమయంలో పనిచేసిన వైద్యులకు ప్రోత్సాహక మార్కులు కేటాయించనున్నారు. ఈ విషయమై మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో 2,553 పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. ఇందుకోసం 24వేల మంది పరీక్ష రాశారని, ప్రస్తుతం జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతుందన్నారు. కొవిడ్ కాలంలో పనిచేసిన వైద్యులకు, వారి విధుల కాలాన్ని బట్టి 2నుంచి 5వరకు ప్రోత్సాహక మార్కులు కేటాయించనున్నామని తెలిపారు. ఫలితాలు వెలువడిన 10 రోజుల్లో నియమాకపత్రాలు అందజేస్తామన్నారు. కొత్త వైద్య కళాశాలలు సహా పలు అంశాలపై ఫిబ్రవరి 5వ తేది కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి నడ్డాను కలుసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

వేసవి సీజన్‌కు కున్నూర్ సిమ్స్ పార్క్ ముస్తాబు

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కున్నూర్ సిమ్స్ పార్క్‌లో వేసవి సీజన్ కోసం 5 లక్షల మొక్కలు నాటుతున్నారు. నీలగిరి జిల్లా కున్నూర్ సిమ్స్ పార్క్‌లో ఇంతవరకూ చేయని విధంగా ఈ ఏడాది అధికంగా 5 లక్షల మొక్కలు నాటాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. సోమవారం ప్రత్యేక పూజల అనంతరం సిబ్బంది మొక్కలు నాటడం ప్రారంభించారు. ఈ విషయమై జిల్లా ఉద్యావన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిబిలమేరి మాట్లాడుతూ.... ప్రస్తుతం ఏడాది వేసవి సీజన్‌లో 65వ పండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు, జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాల నుంచి ప్రత్యేక జాతుల మొక్కలు కొనుగోలు చేశామన్నారు. బ్లాక్స్, డెల్ఫినియం, ఆస్టర్, సైక్లామెన్, లిసియాంథస్ తదితర పూల మొక్కలు నాటే పనులు ప్రారంభించామన్నారు. ఇదివరకే లేని విధంగా వేసవి సీజన్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోనుందని ఆమె తెలిపారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది

చెన్నై చేరుకున్న రజనీకాంత్

అడయార్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ' సినిమా షూటింగ్ కోసం ఇటీవల థాయ్‌లాండ్ వెళ్ళిన సూపర్‌స్టార్ రజనీకాంత్ మంగళవారం నగరానికి చేరుకున్నారు. ఈ నెల 7వ తేదీ ఆయన థాయ్‌కు వెళ్ళి 20 రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ షెడ్యూల్‌లో తన భాగం పూర్తి కావడంతో మంగళవారం వేకువజామున నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో అభిమానులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన హీరో అజిత్ కుమార్‌కు అభినందనలు' అని చెబుతూ వెళ్ళిపోయారు.

ముల్లై పెరియార్ డ్యాం ఇంజనీర్లకు
కృతజ్ఞతలు తెలపాలి

● సుప్రీంకోర్టు

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు - కేరళ రాష్ట్రాలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న ముల్లైపెరియార్ డ్యాం నిర్మించిన ఇంజనీర్లకు కృతజ్ఞతలు తెలియజేయాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇరురాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి వివాదాస్పదమైన ముల్లైపెరియార్ డ్యాం భద్రత, నిర్వహణ పనులను పర్యవేక్షణ కమిటీ మాత్రమే చేపట్టేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, ఇంతకుముందే ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్‌కు బదిలీచేయాలని తమిళనాడు ప్రభుత్వం తరుఫున ప్రతిపాదించిన కోరికను సుప్రీంకోర్టు అంగీకరించింది. అనంతరం ముల్లైపెరియార్ డ్యాం దశాబ్దాలు గడుస్తున్నా భారీ వర్షాలకు వరదలకు చెక్కుచదరకుండా ధృఢంగా ఉందని, ఈ డ్యాం నిర్మించిన ఇంజనీర్లుకు కృతజ్ఞతలు తెలపాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది.



ముల్లైపెరియార్ డ్యాం

ఎల్ఐసీలో మల్టీఅసెట్ అలోకేషన్ పథకం

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) మ్యూచువల్ టర్మ్ మల్టీ అసెట్ అలోకేషన్ అనే కొత్త పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్కే. జహా, ప్రధాన పెట్టుబడుల నిఘా అధికారి నికిల్, సుమిత్ భట్నాగర్, ప్రతీక్ స్వరూప్ ఈ పథకం గురించి మీడియాకు వివరించారు. ఈక్విటీ, డెట్ బంగారంలో పెట్టుబడి పెట్టే ఓపెన్ - ఎండ్ స్కీమ్‌గా వినియోగదారుల సంక్షేమం కోసం ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వచ్చే ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఈ పథకం ఓపెన్ విధానం అమలులో ఉంటుందన్నారు. అలాగే ఫిబ్రవరి 18 వరకు నిరంతర విక్రయం, కొనుగోళ్ల కోసం మళ్లీ తెరచివుంచుతామని వారు తెలిపారు.



సమావేశంలో ఆర్కే జహా, నికిల్, సుమిత్ భట్నాగర్, ప్రతీక్

విల్లుపురంలో మాజీ మంత్రి ఎ.గోవిందసామి స్మారక మండపంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



వీఐటీలో ఘనంగా తిరువళ్లువర్ జయంతి

వేలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని వీఐటీ విశ్వవిద్యాలయంలో తిరువళ్లువర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీఐటీ ఛాన్సలర్, తమిళియక్కం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు జి.విశ్వనాథన్ చేతులమీదుగా రాష్ట్రస్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ, తిరువళ్లువర్ తమిళంలో రచించిన తిరుక్కురల్ మొదటిగా మలయాళంలోకి, ఆ తర్వాత లాటిన్ భాషల్లోకి అనువదింపబడిందన్నారు. తిరుక్కురల్ మొదటి ఎడిషన్ 1812లో ముద్రించబడిందని, 1860వ సంవత్సరంలో దీనిని మరలా ముద్రించారని వివరించారు. 1886వ సంవత్సరంలో జీయూ పోప్ దీనిని ఆంగ్లంలోకి అనువదించారన్నారు. తిరుక్కురల్‌లో 14వేల పదాలున్నాయని, 50కి పైగా స్థానిక తమిళ పదాలు ఇందులో వాడారని, ఇందులో దేవుడి గురించి ఎక్కడా ప్రస్తావించలేదని విశ్వనాథన్ పేర్కొన్నారు. 2013వ సంవత్సరం నాటికి తిరుక్కురల్ కోసం 497 గ్రంథాలు వ్రాయబడ్డాయన్నారు. తిరుక్కురల్ పుస్తకం ఇప్పటివరకు 170భాషల్లోకి అనువాదింపబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమిళియక్కం ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, కోశాధికారి వి.పతుమానార్, వేలూరు ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న విశ్వనాథన్, యూనివర్సిటీ నిర్వాహకులు

● ఈరోడ్ ఉప ఎన్నిక

246 తపాల ఓట్లు నమోదు

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో 246 మంది పోస్టల్ బ్యాలెట్ నియోగించుకున్నారు. ఈ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్ ఫిబ్రవరి 5వ తేది, లెక్కింపు 8వ తేది జరుగనున్నాయి. ప్రధాన ప్రతిపక్షం సహా పలు పార్టీలు ఈ ఎన్నిక బహిష్కరించిన నేపథ్యంలో, అధికార డీఎంకే, నామ్ తమిళర్ పార్టీ మధ్య పోటీ నెలకొంది. వృద్ధులు, దివ్యాంగులు తపాలా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. దీంతో, 85 ఏళ్ల పైబడిన వారు 209 మంది, 47 మంది దివ్యాంగులు మొత్తం 256 మంది తపాలా ఓటుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 23వ తేది తపాలా ఓటు ప్రక్రియ ప్రారంభం కాగా, 256 మందిలో ముగ్గురు వృద్ధాప్యం కారణంగా మృతిచెందగా, ఏడుగురు ఓటు హక్కు వినియోంచుకోలేదు. చివరిగా ఈరోడ్ మనల్‌మేటకు చెందిన 103 ఏళ్ల వృద్ధుడు పెరియన్నన్ తపాలా ఓటు వేశారు. దీంతో, దరఖాస్తు చేసుకున్న వారు ఓటు వేయడంతో తపాలా ఓటు నమోదు ముగిసిందని ఎన్నికల అధికారి తెలిపారు.



తపాలా ఓటు వేస్తున్న 103 ఏళ్ల పెరియన్నన్

ఆలయ ప్రాంగణంలో మట్టికూడు తింటున్న భక్తులు



వెల్లయంగిరి ఆలయానికి భక్తుల అనుమతి

పెరంబూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వెల్లయంగిరి కొండకు భక్తులను అనుమతించనున్నారు. కోవై సమీపంలోని పశ్చిమ కనుమల కొండల్లో పూండిలో వెల్లయంగిరి ఆండవర్ ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని దక్షిణ కైలాసంగా భక్తులు పూజిస్తుంటారు. ఈ ఆలయానికి వెళ్లాలంటే కొండ దిగువ నుంచి ఏడు కొండలు ఎక్కి, స్వయంబువు రూపంలో ఉన్న శివుడిని దర్శించుకొనేందుకు భక్తులు ప్రతి సంవత్సరం కొండపైకి వెళ్తుంటారు.. వెల్లయంగిరి కొండకు భక్తులను ప్రతి ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి మే చివరి వారం వరకు అనుమతిస్తుంటారు. అందులో, మహా శివరాత్రి, చిత్ర పౌర్ణమి రోజుల్లో రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకొని, ఏడు కొండలు ఎక్కి స్వామి దర్శనం చేసుకుంటారు. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి మొదటి వారం నుంచి భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



వెల్లయంగిరి వెళ్లేందుకు కొండ ఎక్కుతున్న భక్తులు (ఫైల్‌ఫొటో)

విరుదగిరీశ్వరాలయంలో
వింత మొక్కులు

● ఒకేసారి 'మట్టికూడు' తిన్న భక్తులు

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా విరుదగిరీశ్వరాలయంలో ఒకే సమయంలో సుమారు 2 వేలమంది భక్తులు నేలపైవేసిన అన్నాన్ని తిని మొక్కులు చెల్లించుకున్నారు. విరుదాచలం ఎరుమనూరు రోడ్డులోని జగముత్తుమారి అమ్మవారి ఆలయంలో ప్రతియేటా తై మాసంలో సమయపురం మారియమ్మన్‌కు మాలలు సమర్పించి పాదయాత్ర నిర్వహించడం ఆనవాయితీ. ఈ యేడాది భక్తులు పాదయాత్రను పురస్కరించుకుని వివాహ, సంతానభాగ్యం కలగాలని కోరుతూ మాలాధారణ చేసి వ్రతమాచరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సామూహికంగా మట్టికూడు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయంలో జగముత్తుమారి అమ్మవారికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అర్చకులు అమ్మవారి విగ్రహానికి పుష్పాలంకరణ చేశారు. ఆ తర్వాత ఆ అమ్మవారిని భక్తులు జంక్షన్ రోడ్డు, పాలక్కరై, బజారువీధి మీదుగా విరుదాలచంలోని విరుదగిరీశ్వరర్ ఆలయం వరకూ ఊరేగించారు.ఆ ఆలయంలో కళై అరంగం వేదికపై అమ్మవారి ఉంచి, భక్తులంతా కలిసి దమరుకం, తప్పెట్ల వాయిద్యంతో అమ్మవారికి జోలపాట పాడారు. చివరకు భక్తులంతా ఆలయ ప్రాంగణంలో కూర్చుని మట్టికూడు తిన్నారు. ఇలా ఒకే సారి భక్తులు మట్టికూడు తిని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. మరికొద్దిరోజులలో ఈ భక్తులంతా ఇరుముడులు కట్టుకుని శ్రీరంగం సమీపం సమయపురం అమ్మవారి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్ళనున్నారు.



తిరునల్వేలిలో మంగళవారం జరిగిన పీఎస్ఎన్ ఇంజనీరింగ్ కాలేజీ రజతోత్సవ వేడుకల్లో ప్రముఖులను సత్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

కొండెక్కిన కొబ్బరి ధర

అడయార్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో కేజీ టెంకాయలు వంద రూపాయలు పలుకుతున్నాయి. ఈ మార్కెట్‌కు పొల్లాచ్చి, ఉడుమలై, తంజావూరు, పట్టుకోట, సేలం, ఆత్తూరు, కడలూరు, బన్రుట్టి, పుదుచ్చేరి ప్రాంతాల నుంచి ప్రతి రోజూ టెంకాయలు వస్తుంటాయి. అయితే, మంగళవారం తక్కువ కాయలు రావడంతో వీటి ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. ఉత్పత్తి తగ్గడం వల్లే టెంకాయల లోడు తగ్గిందని, ఈ ధరల తగ్గుదలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోయంబేడు వ్యాపారులతో పాటు నగర వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,278

తలనీలాలు సమర్పించినవారు: 22,077



సముద్రపు కోతకు అడ్డుకట్ట ..



చెన్నై పట్టినంబాక్కం తీరంలో సముద్రపు కోతను అడ్డుకునేలా 90 తాటి మొక్కలు నాటిన దృశ్యం

ఆటో ఛార్జీలో మార్పులేదు

● ట్రాఫిక్ విభాగం కమిషనర్

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నైలో నడుపుతున్న ఆటో ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదని, పాత విధానమే కొనసాగుతోందని ట్రాఫిక్ కమిషనర్ వివరణ ఇచ్చారు. నగరంలో వేల సంఖ్యలో నడుపుతున్న ఆటోలకు ప్రయాణ దూరాన్ని బట్టి వసూలు చేయాల్సిన ఛార్జీలను రాష్ట్రప్రభుత్వమే నిర్ణయిస్తుంది, ఆ రీతిలో 2013 సెప్టెంబరు 25న పెంచిన ఆటో ఛార్జీలను ప్రయాణీకుల నుండి వసూళ్లు చేసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశించి, ఆటోలకు డిజిటల్ మీటర్లు కూడా పంపిణీ చేసింది. అయితే 70 శాతం మందికిపైగా ఆటో డ్రైవర్లు ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీల కంటే అధికంగా గుంజుకుంటున్నారు. కొన్ని ఆటోలలో మాత్రమే డిజిటల్ మీటర్లు పనిచేస్తుండగా, మిగతా వాటిలో మీటర్లు దిష్టిబొమ్మలా మారాయన్నారు. పొరుగు రాష్ట్రాల నుండి జిల్లా నుండి నగరానికి వచ్చే ప్రయాణికులు వారు వెళ్లాల్సిన స్థలం ఎక్కడుందో తెలియకపోవడం ఒక వైపు, మరోవైపు తమిళం తెలియకపోవడం వంటి కారణాలతో ఆటో డ్రైవర్లు వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని పెద్ద మొత్తాన్ని వారి నుంచి వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆటోడ్రైవర్ల సమాఖ్య ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో నగరంలో నడుపుతున్న ఆటోలకు ఫిబ్రవరి 1వతేదీ నుంచి కొత్త ఛార్జీలు అమలులోకివస్తాయని ప్రకటించింది. దీనిపై అభ్యంతరం తెలిపిన నగర ట్రాఫిక్ విభాగం కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వం ఆటో ఛార్జీలో ఎలాంటి మార్పులు చేయలేదని, పాత విధానమే కొనసాగుతోందని వివరించారు. ఛార్జీలు పెంచాలన్న ఆటో డ్రైవర్ల సమాఖ్య విజ్ఞప్తిని పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ స్పష్టంచేశారు.



మరుదుమలై ఆలయం వద్ద 160 అడుగుల మురుగన్ విగ్రహం

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా మరుదమలై సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద 160 అడుగుల మురుగన్ భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. మరుదమలై ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం మూడున్నరేళ్లలో రాష్ట్రంలోని 2,400 ఆలయాలకు కుంభాభిషేకం పూర్తిచేయడంతో పాటు భక్తులకు కనీసవసతులను మెరుగుపరుస్తున్నామన్నారు. మరుదమలై సుబ్రమణ్యస్వామి ఆలయానికి ఏప్రిల్ 4వ తేది కుంభాభిషేకం జరుగుతుందని, ఈ ఆలయ ప్రాంగణంలో కొత్త కల్యాణ మండపం, లిఫ్ట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ ఆలయ ప్రాంగణంలో 160 అడుగుల ఎత్తు మురుగన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 11 ఆలయాల్లో నిత్యాన్నదానం, మరో 17 ఆలయాల్లో ఒక పూట భోజనం విజయవంతంగా సాగుతోందన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు ఉభయదారులు ఇప్పటివరకు సుమారు రూ.1,200 కోట్లు విరాళంగా అందజేశారని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.





టంగ్‌స్టన్ తవ్వకాలు నిలిచిపోయేందుకు సహకరించిన తనకు కృతజ్ఞతలు తెలిపేందుకు చెన్నైలోని తన నివాసానికి మంగళవారం వచ్చిన ఆ ప్రాంత రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి

భగవన్నామస్మరణే ముక్తికి మార్గం

● పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామి

తిరుమల, జనవరి28 (ఆంధ్రజ్యోతి): భగవన్నామస్మరణే ముక్తికి మార్గమని ఉడిపికి చెందిన పెజావర మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజి ఉద్ఘాటించారు. పురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆస్థాన మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామిజీ మంగళాశాసనాలు అందిస్తూ భగవంతుని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమని పురాణాలు పేర్కొంటున్నాయన్నారు., ఈకోవకు చెందిన పరమభక్తుడు పురందరదాసు అన్నారు. కొక్కె సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్నతీర్థ స్వామిజీ మాట్లాడుతూ దాససాహిత్య ప్రాజెక్టు హైందవ సనాతన ధర్మ ప్రచారానికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ పురందరదాసు కీర్తనలు యావత్తు లోకోక్తులేనన్నారు. అనంతరం స్వామిజీలను శాలువ, శ్రీవారి ప్రసాదంతో సన్మానించారు. జేఈవో వీరబ్రహ్మం, దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



విశ్వప్రసన్నతీర్థ స్వామిని సన్మానిస్తున్న టీడీడీ అదనపు ఈవో

‘డిజిటల్ అరెస్టు’ మోసంలో మరో ఆరుగురి అరెస్టు

రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరిట తిరుపతిలోని మహిళను మోసం చేసిన కేసులో మరో ఆరుగురు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.32.5 లక్షలు, నగలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అరెస్టయిన నిందితుడిని విచారించడంతో ఈ ఆరుగురి విషయం బయటపడింది. ఈ వివరాలను మంగళవారం ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. విశాఖపట్నం త్రినాథపురానికి చెందిన సింగంపల్లి గణేష్, చిన్నవాల్తేరుకు చెందిన పాలకొల్లు రవికుమార్, కంచరపాలేనికి చెందిన యల్లి జగదీష్, రామ్‌నగర్‌కు చెందిన ఆనంద్ సంతోష్‌కుమార్, పెందుర్తి మండలం ఎల్ఐసీ కాలనీకి చెందిన అమరనాథ్, మురళినగర్‌కు చెందిన కర్రి వాసుదేవ్ స్నేహితులు. కొన్నేళ్లుగా జులాయిగా తిరుగుతూ ఈజీ మనీకోసం పలువురిని మోసం చేసేవారు. ఇలా.. తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో ఫోను, వాట్సాప్ కాల్ చేశారు. తాము ఢిల్లీకి చెందిన సీబీఐ అధికారులమని, రూ.200 కోట్లు మనీ ల్యాండరింగ్.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు మీ బ్యాంకు ఖాతాల్లోని నగదు వినియోగించడంపై అరెస్టు చేయాల్సి ఉంటుందని బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాల్లోని నగదు తమకు పంపితే వాటిని పరిశీలించి మనీల్యాండరింగ్‌లో మీ పాత్ర లేకుంటే తిరిగి జమ చేస్తామని చెప్పారు. దీంతో ఆమె తన ఐదు ఖాతాల్లోని రూ.2.5 కోట్లను వారు చెప్పిన ఖాతాలకు పంపారు. దీనిపై వారు మళ్లీ స్పందించకపోవడంతో ఈ నెల 13న తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన వినయ్‌కుమార్‌ను ఈనెల 22న అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ఆరుగురు ఉన్నట్లు అతడు చెప్పడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు పర్యవేక్షణలో సైబర్ క్రైం సీఐ వినోద్, క్రైం.. వెస్ట్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సెల్ టవర్ ఆధారంగా నిందితులను పట్టుకుని అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. వారి నుంచి రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారు నగలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్ టాప్‌లు, ఒక సిమ్ మాడ్యూల్స్, ఎనిమిది రూటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఓ నిందితుడి ఖాతాలోని రూ.10 లక్షలను ఫ్రీజ్ చేశారు. వీరంతా కంబోడియా వెళ్లి సైబర్ నేరాలపై శిక్షణ పొంది వచ్చినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రతిభ చూపిన వెస్ట్ సీఐ మురళీమోహన్, సైబర్ క్రైం సీఐ వినోద్, సీసీఎస్‌సీఐ ప్రకాష్, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీ శ్రీలత, సీఐలు, వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కెంచనబల్లలో మైలారు పండుగ

● దేవరెద్దుల పందేలతో జనసంద్రంగా వీధులు

రామకుప్పం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామంలో మంగళవారం మైలారు పండుగ (ఎద్దుల పరుగు పందేలు) కోలాహలంగా జరిగింది. పండుగను తిలకించేందుకు ఉదయం 6 గంటల నుంచే వేలాదిగా తరలివచ్చిన జనంతో కెంచనబల్ల వీధులు జనసంద్రంగా మారాయి. ఉదయం గ్రామస్థులు స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవరెద్దులను ఊరేగించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ గిత్తలను బరిలో పరుగులు తీయించారు. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. మొత్తం 244 ఎద్దులు పోటీల్లో పాల్గొనగా రామకుప్పం మండలం గూళిపల్లె సుబ్రహ్మణ్యం ఎద్దు మొదటి స్థానంలో నిలిచింది. సుబ్రహ్మణ్యం మొదటి బహుమతిగా రూ.10,1116 అందుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం రామనాయకపేట ఆర్ఆర్ వాసుకు చెందిన ఎద్దు రెండో స్థానంలో నిలవడంతో రూ.70,001 బహుమతి తీసుకున్నాడు. అలాగే పోటీల్లో సత్తా చాటిన 50 ఎద్దుల యజమానులకు వివిధ బహుమతులు అందించారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం ఎస్ఐ వెంకటమోహన్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాణాచారి, నాయకులు సతీష్, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, గోవిందప్ప, రమేష్, వీరనాగపురం నాగరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పరుగులు తీస్తున్న ఎద్దులు

నేటి సుప్రభాత వేళ..

షార్‌లో సెంచరీ ప్రయోగం

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): షార్‌లో బుధవారం సూర్యోదయ వేళ ఇస్రో వందో రాకెట్ ప్రయోగం జరపనుంది. ఉదయం 6.23 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. ఈ రాకెట్ ద్వారా నావిగేషన్ సేవలకు సంబంధించిన నావిక్-02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు. షార్ నుంచి సెంచరీ ప్రయోగం కావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఇటు శాస్త్రవేత్తలు, ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు షార్ చేరుకొని ప్రయోగ ఏర్పాట్లో నిగమ్నమై ఉన్నారు. ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు ప్రారంభమై నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఈ ఏడాది షార్ నుంచి ఇది తొలి ప్రయోగం.



ప్రయోగ వేదికపై రాకెట్

చెంగాళమ్మకు మొక్కులు

జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఇస్రో ఛైర్మన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆరుముగం రాజరాజన్, షార్ అధికారులు గోపికృష్ణ తదితరులున్నారు.



మూడు దశల్లో రాకెట్ ప్రయోగం

మొదటి దశ: నాలుగు స్ట్రాపాన్ ద్రవ ఇంధన బూస్టర్లలో.. ఒక్కోదానిలో 42.675 టన్నుల ద్రవ ఇంధనం నింపి ఉంటారు. వీటి సాయంతోనే మొదటి దశలో రాకెట్ పయనమవుతోంది. 151 సెకన్లకు మొదటి దశ పూర్తవుతుంది.

రెండోదశ: 42.15 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో రెండో దశను 294 సెకన్లకు పూర్తి చేస్తారు. అక్కడ నుంచి క్రయోజనిక్ దశగా పేరొందిన మూడో దశ ప్రారంభమవుతుంది.

మూడోదశ: ప్రయోగంలో కీలకమైన దీనిని క్రయోజనిక్ దశ అంటారు. 14.96 టన్నుల క్రయోజనిక్ ఇంధన సాయంతో 1,140 సెకన్లకు మూడో దశను కటాఫ్ చేస్తారు దీంతో రాకెట్ మూడు దశల పయనం పూర్తవుతుంది.

● ఆ తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్‌లోని 2,250 కిలోల బరువు కలిగిన నావిక్-02 ఉపగ్రహాన్ని 170 కిలో మీటర్ల దూరంలో భూమికి దగ్గరగా (పెరిజి) 36,577 కిలో మీటర్ల దూరంగా (అపోజి) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెడతారు. ప్రయోగం మొత్తం 19.17 నిమిషాలకు పూర్తయ్యేలా శాస్త్రవేత్తలు రాకెట్‌ను డిజైన్ చేశారు.

హరిత విప్లవంతో ఆరోగ్యానికి ముప్పు

● సహజ ఎరువుల వాడకమే శ్రేయస్కరం

● ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హరిత విప్లవం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు వాటిల్లుతోందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో ఐదు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలేకర్ పాల్గొని ప్రసంగించారు. హరిత విప్లవంతో దిగుబడి పెరిగినా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. క్యాన్సర్, షుగర్, గుండె వ్యాధులకు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం కూడా కారణమవుతోందన్నారు. జన్యుపరమైన వంగడాల వల్ల నైట్రోజన్, ఆక్సిజన్ కలసి వాతావరణం ప్రభావితమవుతోందన్నారు. తద్వారా వరదలు, కరవులు, తుపానులు, కాలుష్యం పెరుగుతున్నాయన్నారు. మరోపక్క ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల అల్ట్రా వైలెట్ కిరణాలు వ్యవసాయ ఉత్పత్తుల్లోని సత్తువను దెబ్బతీస్తున్నాయన్నారు. మూడు నుంచీ ఐదు లేయర్ల పంట విధానాన్ని పాటించడమే దీనికి పరిష్కారమన్నారు. కృత్రిమ ఎరువుల స్థానంలో గో ఆధారిత పాంచగవ్య, సహజ ఎరువులను వాడాలన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ సహజ వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. శాప్ ఛైర్మెన్ రవినాయుడు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని యువత ప్రచారం చేయాలన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, దేశవాళీ ఆవు, వ్యవసాయ ఉపకరణాల ప్రదర్శన, అమ్మకం చేపట్టారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, సేవ్ సంస్థ ప్రతినిధి విజయరామ్, ప్రిన్సిపాళ్ళు నరసయ్య, శ్రీనివాస్, సుధారాణి, వర్డ్ ప్రతినిధి గంగాధర్, ఎఫ్‌సీఐ మాజీ సభ్యుడు కృష్ణ హరీష్, పత్తిపాటి వివేక్ చౌదరి, చంద్ర, వేణు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్